
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



70 టీఎంసీలకు సోమశిల

జలాశయం మంగళవారానికి 70.230 టీఎంసీలకు చేరుకుంది. 19,510 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 400, కండలేరుకు 9,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,12,,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,110
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,413
నవర (8 గ్రాములు)	రూ.83,304

గరిష్టం/కనిష్టం
39.1 /28.8

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం ఉరుములు, మెరుపులతో మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం మంగళవారం గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

యూరియా కొరత తీరుస్తాం



వ్యవసాయ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: మెట్ట ప్రాంతంలో ఆలస్యంగా సాగు చేపట్టిన వరికి యూరియా కొరత లేకుండా తీరుస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి చెప్పారు. ఉదయగిరిలో సోమవారం యూరియా పంపిణీలో రైతుల వెతలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం నేపథ్యంలో ఆమె మంగళవారం ఉదయగిరికి చేరుకుని అధికారులు, రైతులతో మాట్లాడారు. జిల్లాలో సాగులో ఉన్న పంటల వినియోగానికి సంబంధించి అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు మండలాల్లో సాగులో ఉన్న పంటలకు అవసరమైన యూరియాను బుధవారం నుంచి ఉదయగిరి మండలం గుడినరవ, బండగానిపల్లిలో నిల్వలు ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఏ లక్ష్మీమాధవి, అన్ని మండలాల వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార శాఖ డీడీగా వేణుగోపాల్‌రెడ్డి



వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరురూరల్: జిల్లా పౌర సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పీ వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో పౌర సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న పీ వేణుగోపాల్‌రెడ్డికి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ నెల్లూరు పౌర సమాచారశాఖ డీడీగా నియమించింది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,117 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,765 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

27న ఫొటోగ్రఫీ, రీల్స్, వీడియోల పోటీలు



జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ

నెల్లూరురూరల్: ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫొటోగ్రఫీ, రీల్స్ వీడియోల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఎకోటూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు, సజనాత్మక ప్రతిభ కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఫొటోలు హైరిజల్యూషన్ కలిగి నెల్లూరు జిల్లాలో తీసినవే అయి ఉండాలన్నారు. జేపీజీ ఫార్మాట్లో అందించాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 20వ తేదీలోపు అందజేయాలని కోరారు. రీల్స్, వీడియోల పోటీలకు రీల్స్ 30-90 సెకన్లు (ఇన్‌స్టాగ్రాం), వీడియో వ్యవధి గరిష్టంగా 3 నిమిషాలు ఉండేలా రూపొందించాలని సూచించారు. ఈ పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తోపాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో అందజేయనట్లు ఆమె చెప్పారు. ఫొటోలు, వీడియోలు, రీల్స్‌ను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయం, 2వ అంతస్తు, బోట్ షికారు క్యాంపస్, బారాషాహిద్ దర్గా దగ్గర, దర్గామిట్ట, నెల్లూరులో అందించాలని ఆమె సూచించారు. పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు తమ వివరాలకు 9493668022 / 7780749802 నంబర్లలో నమోదు చేసుకోవాలని, క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న కాకాణి, చిత్రంలో పర్వతరెడ్డి, ఆనం తదితరులు



కందుకూరులో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్



కావలిలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

హలధారి.. రణభేరి

ఆంక్షలు పెట్టి అడ్డుకున్నా.. ఆగని అన్నదాతలు

హలధారి రణభేరి ఉద్యమ స్ఫూర్తిని ప్రజ్వలింపజేసింది. రైతు ఉద్యమాన్ని అణచివేయాలన్న సీఎం చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు కర్షకుల అడుగులను అడ్డుకోలేకపోయాయి. ఊరి పొలిమేర నుంచి ఆర్డీఓ కార్యాలయాల గేట్ల వరకు పోలీసులు అడ్డుపడినా ఆంక్షలు, నిర్బంధాలు, బెదిరింపులను లెక్క చేయని హాలికులు కదం తొక్కారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు, బ్యారికేడ్లు పెట్టినా, హౌస్ అరెస్టులు చేసినా భయం, బెదిరింపుల వలయాలను ఛేదించుకుని కర్షక స్ఫూర్తి, వ్యవసాయ భవిష్యత్‌ను కాంక్షిస్తూ సాగిన మహాపోరాటం, 'రైతు ద్రోహి చంద్రబాబు' అంటూ గర్జన నినాదాలు అధికార కుర్చీని వణికించాయి. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని రైతులు ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఎక్కడికక్కడ నిరసన ర్యాలీలు, నినాదాలతో హోరెత్తించారు. భారీగా పోలీసులు మోహరించి అడుగడుగునా అడ్డంకులతో ఖాకీలు పెట్టిన కఠిన ఆంక్షలను ఎదురొడ్డి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా రైతుకు బాసటగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతమైంది.

- జిల్లాలో ఎక్కడికక్కడ బారికేడ్లు, చెక్‌పోస్టులు, హౌస్ అరెస్టులు
- కావలిలో పోలీసులు ఓవరాక్షన్
- ర్యాలీలకు అనుమతి లేదని బెదిరింపులు
- రైతు ద్రోహి చంద్రబాబు అంటూ నినాదాలు
- ఉద్యమంలో ముందుకు నడిచిన కాకాణి, పర్వతరెడ్డి
- నెల్లూరు జిల్లాలో విజయవంతమైన 'అన్నదాత పోరు'

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎరువుల కొరతను పరిష్కరించాలని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నదాత పోరు'లో భాగంగా మంగళవారం కర్షకులు జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు రెవెన్యూ డివిజన్లలో రణభేరి మోగించారు. కూటమి ప్రభుత్వ పెద్దల చీకటి సూచనల మేరకు 'అన్నదాత పోరు'ను ఎట్టి పరిస్థితుల్లోనూ విఫలం చేయాలని పోలీసులు అడుగడుగునా ఆంక్షలు పెట్టి, ఆటంకాలు కల్పించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి తనిఖీలతో అడ్డుకున్నారు. ముఖ్య నేతలకు నోటీసులిచ్చి, ర్యాలీలకు అనుమతి లేదని పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని బెదిరింపులు చేశారు. గ్రామాల్లోని ముఖ్యనేతలు, రైతు నేతలందరికీ వేకువజాము నుంచే నోటీసులు ఇచ్చారు. కొందరిని హౌస్ అరెస్టులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వెళ్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 10 నుంచి 15 మంది మాత్రమే ప్రదర్శనగా వెళ్లాలని అడ్డగోలుగా నిబంధనలు పెట్టారు. జొన్నవాడ, వెంకటాచలం, కోవూరు, ఇరుగాళమ్మ సంఘం ఇలా ఎక్కడిక్కడక చెక్‌పోస్టులు పెట్టి వాహన చోదకులను చెక్ చేసి 'అన్నదాత పోరు'కు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, రైతులను అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడరాదని సూచించారు. మైక్ వాడరాదని హెచ్చరించారు. ఆర్డీఓ కార్యాలయాలకు వచ్చే మార్గాల్లో బారికేడ్లు పెట్టి ఎవరినీ వెళ్లకుండా నియంత్రించారు.

➡ సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్, నెల్లూరుసిటీ నియోజకవర్గాలకు సంబంధించి మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నల్లపరెడ్డి రంజిత్‌కుమార్‌రెడ్డి



నెల్లూరులో వీఆర్‌సీ నుంచి కలెక్టరేట్ వరకు భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మహార్యాలీ

ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు'కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వేలాది మంది రైతులు పోటెత్తారు. వీఆర్‌సీ నుంచి కలెక్టరేట్ వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనగా భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు వినతపత్రం అందజేశారు.

➡ ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అన్నదాత పోరు'కు విశేష స్పందన లభించింది. ఈ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు నాయకులు, కార్యకర్తలు పాల్గొనకుండా పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గత రాత్రే పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పార్టీ మున్సిపల్ కమిటీ రాష్ట్ర సభ్యుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, తదితరులకు సీఐ ఫోన్లు చేసి ర్యాలీలో అధిక సంఖ్యతో పాల్గొనరాదని, 15 మందికి మించి ఉండరాదని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించరాదని ఫోన్‌లో తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ బస్టాండ్ వద్ద రైతు పోరు యాత్ర కోసం ఏర్పాటు చేసిన షామియానాను సీఐ గంగాధర్ తొలగించారు. అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, సీఐకి కొంత సేపు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి.

➡ కందుకూరులో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' నిరసన ప్రదర్శనను భగ్నం చేసేందుకు కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని కుట్రలు చేసింది. కార్యక్రమానికి అనుమతి ఇవ్వక పోగా, టెంట్‌లు వేయనీకుండా, మైక్ పర్మిషన్ లేదంటూ, ఎక్కువ మంది పాల్గొనకూడదంటూ అడ్డంకులు సృష్టించారు. ప్రతి మండలం నుంచి 20 మంది లోపే వెళ్లాలని, లేకుంటే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు. అయినా సరే లెక్క చేయని అన్నదాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఒక దశలో సీఐ అన్వర్‌బాషా ర్యాలీ నిర్వహించడానికి వీల్లేదని, కారులోనే సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లాలని బుర్రాను కోరారు. అయితే దీనికి ససేమిరా అన్న బుర్రా రైతులతో కలిసి ప్రదర్శనగా వెళ్లారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోకి ఎవర్నీ అనుమతించకుండా గేటు వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి ఆంక్షలు పెట్టారు. బుర్రాతో పాటు కొద్దిమంది నాయకులను మాత్రమే సబ్‌కలెక్టర్ కార్యాలయంలోకి అనుమతించారు. సబ్‌కలెక్టర్ హిమవంశీని కలిసిన బుర్రా ఆయనకు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

➡ కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు సంబంధించి కావలిలోని ఆర్డీఓ కార్యాలయానికి రైతులు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కదం తొక్కారు. కావలికి వచ్చే నలు మార్గాల్లో బారికేడ్లు పెట్టి తనిఖీలు చేస్తూ పోలీసులు అడ్డుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి వచ్చే రైతులు, పార్టీ శ్రేణులు జమ్మలపాళెం వద్ద నుంచి ఎవరికి వారు కావలికి చేరుకున్నారు. కావలి నియోజకవర్గానికి సంబంధించి అందరూ ఆర్‌ఎస్సార్ కల్యాణమండపం వద్ద నుంచి ర్యాలీగా బయలేదేరేందుకు సిద్ధంగా ఉండగా, డీఎస్పీ శ్రీధర్, సీఐలు భారీ బలగాలతో చేరుకుని అడ్డుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వచ్చే వరకు కదలబోమన్నారు. ఆయన అక్కడికి చేరుకోవడంతో మేకపాటితో పోలీస్ అధికారులు వాగ్వాదానికి దిగారు. 15 మంది కంటే ఎక్కువగా వెళ్లడానికి వీల్లేదంటూ ఆంక్షలు పెట్టారు. ఈ క్రమంలో కొందరు నేరుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు.



ఆత్మకూరులో మేకపాటి విక్రమ్‌రెడ్డి భారీ ర్యాలీ



వెంకటేశ్వరపురం వద్ద బారికేడ్లు పెట్టి ఎవరినీ రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టరేట్ వద్ద రోప్ పార్టీతో రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రశ్నిస్తే గొంతునొక్కుతున్న ప్రభుత్వం

- చంద్రబాబు పాలనలో రైతన్నల రోదనలు
- యూరియా దొరకదు.. పంటలకు గిట్టుబాటు లభించదు
- రైతు సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కాకాణి, పర్వతరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, పూజిత, రజత్‌కుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): రైతులు పంటలు పండించుకునేందుకు ఒక్క బస్తా యూరియా దొరకడంలేదు. బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదంటూ కూటమి ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాకాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా రైతు సమస్యలపై ధర్నా చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలకు దరఖాస్తు చేసుకుంటే అర్ధరాత్రి రెండు గంటలకు వాట్సాప్ ద్వారా అనుమతిస్తున్నట్లు మెసేజ్ పెట్టడం దారుణమన్నారు. అది కూడా 15 మందికే అనుమతి అని పేర్కొనడం బాధాకరమన్నారు. పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నా, ఎన్ని ఆంక్షలు పెట్టినా రైతులు వేలాది మంది తరలి రావడం, కార్యక్రమాన్ని సూపర్ సక్సెస్ చేయడం చూస్తే కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత అర్థమవుతుందన్నారు. ప్రశ్నిస్తే గొంతునొక్కడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

చేతులు మారిన రూ.200 కోట్ల కమీషన్లు

రూ.270లకు అందాల్సిన యూరియా బస్తా బహిరంగ మార్కెట్‌లో రూ.600లకు అమ్ముతున్నారని కాకాణి ఆరోపించారు. 50 శాతం ఎరువులు మాత్రమే డీలర్లకు ఇవ్వాలన్నారు. మిగతా 50 శాతం సొసైటీల ద్వారా, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించాలనేది నిబంధన ఉందన్నారు. లక్షల టన్నుల యూరియా తీసుకువచ్చామని చెబుతున్న ప్రభుత్వం అదంతా ఎక్కడికి పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 50 శాతంకి మించి డీలర్లకు ఎరువులు ఇవ్వడం వెనుక రూ.200 కోట్ల కమీషన్లు చేతులు మారాయన్నారు.

రూ.3 వేల కోట్లతో మా ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ నిధి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వ్యవసాయం పండగ చేసిన విధంగా తమ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఎరువులు అందించారన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు అధికారంలోకి రాగానే ధరల స్థిరీకరణ నిధిని ఎత్తేశాడన్నారు. తమ ప్రభుత్వంలో పుట్టి ధాన్యానికి మద్దతు ధర 19,700 ఉంటే బహిరంగ మార్కెట్‌లో రైతులు రూ.24 వేలకు అమ్ముకున్నారన్నారు. చంద్రబాబు పాలనలో రూ.15 వేలకే పుట్టి ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తమ కాలంలో రైతులు ఏనాడు రోడ్డెక్కలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ ఉద్యమం అంటే చంద్రబాబుకు వణుకు



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు దివంగత సీఎం వైఎస్సార్, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత నిచ్చారన్నారు. అయితే అందుకు విరుద్ధంగా చంద్రబాబు పాలనలో రైతు కంట కన్నీరు కారుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సెక్షన్ 30 పేరు చెప్పి నోటీసులు ఇవ్వడం, హౌస్ అరెస్టులు చేయడం, రైతులను ధర్నాలకు రానీయకుండా పోలీసులు దిగ్బంధించడం చూస్తే చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ ఉద్యమం అంటే వణుకు పుడుతుందన్నారు. వైఎస్సార్ జలయజ్ఞం, జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను ఆదుకుంటే చంద్రబాబు రైతు కష్టాలను గాలికొదిలేశాడని విమర్శించారు.

అన్నం పెట్టే రైతు రోడ్డెక్కాల్సిన దుస్థితి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ అందరి ఆకలి తీర్చేందుకు కష్టపడే రైతన్నలు ఒక్క కట్ట యూరియా కోసం రాత్రి, పగలు క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏంటని నిలదీశారు. రైతులకు ఎరువులు ఇవ్వకుండా వ్యాపారుల గుప్పెట్లో పెట్టడం సిగ్గు చేటన్నారు. వరి కోతలు ప్రారంభమై 10 రోజులు అయిందని మరో 15 రోజుల్లో వరికోతలు పూర్తవుతున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు.

ఏ పంటకు గిట్టుబాటు ధరల్లేవు



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివుని నారసింహారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల కాలంలో పత్తి, పసుపు, మినుము, వరి, ఉల్లి ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. అధికారంలోకి వస్తే సంవత్సరానికి రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తానన్న చంద్రబాబు తొలి సంవత్సరం ఎగనామం పెట్టాడన్నారు. రెండో సంవత్సరం కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ రెండేళ్లకు చంద్రబాబు రైతులకు రూ.35 వేలు బాకీ ఉన్నాడన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు, రైతులు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, మొయిళ్ల గౌరి, లక్ష్మీసునంద, మల్లి నిర్మల, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, ఊటుకూరు నాగార్జున, ఆశ్రిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై సీఎం చెప్పేవన్నీ అబద్ధాలే..



కందుకూరు: యూరియా సరఫరా కాక రైతులు ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం వచ్చే సీజన్‌కు కూడా యూరియా అందుబాటులో ఉందంటూ పచ్చి అబద్ధాలు చెబున్నారని మాజీ ఎమ్మెల్యే కందుకూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ దుయ్యబట్టారు. ఇండోసోల్ కంపెనీ కోసం బలవంతంగా భూములు తీసుకోవడంతో నష్టపోతున్న రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు పాల్పడితే కోర్టుకు వెళ్లి అయినా అడ్డుకునే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. అవినీతి పనులు చేస్తే తగిన గుణపాఠం చెప్తారనే విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

క్లుప్తంగా

కాకాణిని కలిసిన తూమాటి



కందుకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని రాజకీయ అంశాలపై చర్చించినట్లు తూమాటి తెలిపారు.

న్యూరో సర్జన్‌కు గోల్డ్‌మెడల్



ప్రశంసాపత్రం అందుకుంటున్న ధీరజ్

నెల్లూరు(అర్బన్): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 27వ, 28వ కాన్వొకేషన్ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతోంది. ఇందులో భాగంగా నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ధీరజ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌తో గోల్డ్‌మెడల్‌ను సాధించారు. 2021 – 22 సంవత్సరానికి సంబంధించి స్టేట్ బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ కింద మంగళవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ధీరజ్ మాట్లాడుతూ ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహం

కోవూరు: మండలంలోని పడుగుపాడు – జమ్మిపాళెం అండర్ బ్రిడ్జి కింద నీటిలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి శరీరంపై గాయాలున్నాయి. అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందు మాకు.. తర్వాతే మీకు..

- కూటమి సభకు ఆర్టీసీ బస్సులు
- ఇక్కట్లు పడిన ప్రయాణికులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం



నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నెల్లూరు సిటీ: ఊరికెళ్లేందుకు బిడ్డలతో వచ్చిన తల్లులు.. వేరే నగరంలో చదువుకునే విద్యార్థులు.. ఉద్యోగంలో భాగంగా మరో ప్రాంతానికి చేరాల్సిన వ్యక్తులు.. ఆస్పత్రులకు వెళ్లాల్సిన వృద్ధులు.. ఎందరో ఆర్టీసీ బస్టాండ్లకు వచ్చి బస్సుల కోసం ఎదురు చూశారు. కానీ కూటమి పెద్దలు బస్సుల్ని తమ సభకు తరలించి వారందరినీ కష్టపెట్టారు.

అనంతపురంలో బుధవారం కూటమి పార్టీలు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభను నిర్వహిస్తున్నాయి. దీని కోసం జిల్లా నుంచి 260 బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. నెల్లూరు డిపో–1 నుంచి 40, డిపో–2 నుంచి 60, ఆత్మకూరు నుంచి 31, కావలి నుంచి 40, ఉదయగిరి నుంచి 29, కందుకూరు నుంచి 35, రాపూరు నుంచి 25 బస్సులను పంపారు. మంగళవారమే వాహనాలను తరలించారు. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేయలేక అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది మే 30వ తేదీన మహానాడు కార్యక్రమానికి 259 బస్సులు కేటాయించారు. ఇలా కూటమి పెద్దలు ఇబ్బంది పెడుతుండటంతో ప్రయాణికులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

ఎదురుచూపులు

నగరంలోని డిపో 1, 2లో బస్సుల కోసం ప్రయాణికులు మంగళవారం గంటల తరబడి ఎదురుచూశారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు మండలాల నుంచి నగరానికి వచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. నెల్లూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకున్న వారు వచ్చిన ఒకటి, రెండు బస్సుల్ని ఎక్కేందుకు పడిన పాట్లు వర్ణనాతీతం. గంటలు తరబడి వేచి చూసినా బస్సులు రాకపోవడంతో కొందరు తిరిగి వెళ్లిపోయారు. మరికొందరు ఇతర వాహనాలను ఆశ్రయించారు.

అసలు బస్సులేవీ?

అసలే ఉచిత బస్సుకు ఆంక్షలున్న నేపథ్యంలో మహిళలు అసహనంగా ఉన్నారు. బుధవారం జరిగే సభకు బస్సుల్ని పంపారు. ఊర్లకు వెళ్లేందుకు వచ్చిన మహిళలు బస్టాండ్లలోని పరిస్థితుల్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ తీరు బాగోలేదని బహిరంగంగానే వ్యాఖ్యానించారు.



వచ్చిన ఒక్క బస్సెక్కేందుకు పాట్లు పడుతూ..



ఆ సీటు మాది..

రేషన్ బియ్యం స్వాధీనం



సంగం : స్వాధీనం చేసుకున్న బియ్యం



ఆత్మకూరు : పోలీస్‌స్టేషన్‌లో వాహనం

సంగం: మండలంలోని సిద్ధీపురం వద్ద జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ట్రక్ ఆటో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

84 బస్తాలు

ఆత్మకూరు: బొలెరో వాహనంలో నెల్లూరుకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఆత్మకూరు మండలంలోని వాశిలి సమీపంలో ఎస్సై ఎస్కే జిలానీ మంగళవారం పట్టుకున్నారు. వివరాలు.. ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల పరిధిలోని గ్రామాల్లో సేకరించిన 84 బస్తాలను బొలెరోలో లోడ్ చేసుకుని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వాహనాన్ని, అందులోని ఇద్దరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కొమ్మలపూడిలో అగ్నిప్రమాదం

- రెండు పూరిళ్లు దగ్ధం




మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి గిరిజన కాలనీలో అగ్నిప్రమాదం జరిగింది. రెండు పూరిళ్లు దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం మేరకు.. కాలనీకి చెందిన వెందోటి శీనమ్మ, వెందోటి చందనమ్మ మేకలు మేపుతుంటారు. మంగళవారం ఉదయం మేకలు మేపేందుకు పొలానికి వెళ్లారు. ఏమైందో తెలియదు గానీ పూరిళ్లు మంటల్లో కాలిపోయాయి. ఎవరైనా సిగరెట్, బీడీ తాగి పడేసి ఉంటారని భావిస్తున్నారు. పక్కనే ఉన్న మేకల కొట్టం కూడా దగ్ధమైంది. శీనమ్మ ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, నిత్యావసర సరుకులు, టీవీ, దుస్తులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఆర్ఐ అరుణ్‌తేజ్, వీఆర్వో బుజ్జయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.130
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.234
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.258
లేయర్ చికెన్:	రూ.210

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.40
సన్నవి :	రూ.25
పండ్లు :	రూ.15



నేడే పోలేరమ్మ జాతర



విద్యుద్దీపాలంకరణ

వెంకటగిరి రూరల్: ప్రసిద్ధి చెందిన పోలేరమ్మ తల్లి జాతర బుధవారం కోలాహలంగా ప్రారంభం కానుంది. ఉదయం నుంచే ప్రతి వీధిలో పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి.. అంటూ భక్తుల నినాదాలతో పట్టణం హోరెత్తనుంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వేపాకు తోరణాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లో పసుపు ప్రతిమను తయారు చేసి పూజలు చేస్తారు. అంబలిని నైవేద్యంగా సమర్పించి భక్తిని చాటుకుంటారు. పోలేరమ్మ తల్లి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఉచితంతోపాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లు పెట్టారు. వెంకటగిరి జన జాతరకు బుధ, గురువారాల్లో లక్షలాది మంది తరలిరానున్నారు. దీంతో పట్టణంలో ఏ ఇంట్లో చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది.

ఆర్టీసీ ఖాళీ స్థలాలు వినియోగించుకోవాలి

- ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న తిరుమలరావు

ఆత్మకూరురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోలకు సంబంధించిన ఖాళీ స్థలాలను ఓస్ – 15 పథకం కింద సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో ప్రాంగణాలను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, అధికారుల పనితీరును పరిశీలించి వారిని అభినందించారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన 10 మందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, డిపో మేనేజర్ శివకేశ్ యాదవ్, ఈడీ అప్పలరాజు, నాగేంద్ర, డీటీపీఓ షమీమ్, అసిస్టెంట్ డీఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ప్రదేశంలో పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు – జంగంరెడ్డిపల్లి గ్రామాల మధ్య తిప్ప సర్వే నంబర్ 233/1లో సుమారు 40 హెక్టార్లలో మైనింగ్‌పై వివాదం ముదురుతోంది. పర్మిషన్లు, అడ్డంకులు, ప్రజా నిరసనలు కొనసాగుతుండగా స్థానికులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నెల్లూరుకు చెందిన కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ అశోక్‌కుమార్ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారం మైనింగ్ ప్రదేశం నివాస ప్రాంతం నుంచి కనీసం 200 మీటర్ల దూరంలో ఉండాలి. కానీ జంగంరెడ్డిపల్లి గ్రామం కేవలం 130 మీటర్ల దూరంలో, జగనన్న లేఅవుట్ 50 మీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జరిగితే ఒప్పుకోమని స్థానికులు హెచ్చరించారు. మీడియా ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వకుండా నివేదికను హైకోర్టుకు పంపిస్తామని మాత్రమే తెలిపారు.

కండలేరులో 42.520 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 42.520 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6,800 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం

- హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు
- ప్రశాంతంగా కార్యవర్గ ఎన్నికలు



నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో ఉద్యోగుల సమస్యలపై హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ తెలిపారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో మంగళవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పీఆర్సీ, పెండింగ్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారానికి ఇతర సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ సూచనలతో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నారాయణరాజు, నిర్వహణ కార్యదర్శి జలీల్ అహ్మద్, ఉపాధ్యక్షులు మురళి, నాగరాజు, నాగరాజమ్మ, ఉష, ఇందుకూరుపేట తాలూకా ప్రెసిడెంట్ అరుణరాణి, నెల్లూరు రూరల్ తాలుకా ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

- హంస తాలూకాలో ఖాళీ పదవులకు ఎన్నికలు జరిగాయి. నెల్లూరు సిటీకి సంబంధించి ఎన్నికల అధికారులుగా జలీల్ అహ్మద్, నాగరాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాలూకా ప్రెసిడెంట్‌గా గౌస్‌బాషా (హెల్త్ సూపర్‌వైజర్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటేష్ (డిప్యూటీ హెచ్ఈఓ), సెక్రటరీగా బి.మంజరి (హెల్త్ అసిస్టెంట్), కోశాధికారిగా ఉమామహేశ్వరి (హెడ్ నర్సు), ఉపాధ్యక్షులుగా వెంకటశేషయ్య (సీనియర్ అసిస్టెంట్), ప్రభావతి (ఫార్మసీ ఆఫీసర్), కల్పన (సచివాలయ హెల్త్ సెక్రటరీ), శ్రీదేవి (హెడ్ నర్సు), కేవీ రాహుల్ (జూనియర్ అసిస్టెంట్), జాయింట్ సెక్రటరీలుగా సురేష్‌కుమార్ (ఎస్ఏ), సచివాలయ హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్న రామలక్ష్మి, ఆసియాబేగం, జయశీల, రెహానీలను ఎన్నుకున్నారు.
- రూరల్ తాలూకా పరిధిలో పబ్లిసిటీ సెక్రటరీగా మార్క్, నిర్వహణ కార్యదర్శిగా పృథ్వీరాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా బ్రహ్మేశ్వరి, జాయింట్ సెక్రటరీలుగా అనితకుమారి, లక్ష్మీనారాయణమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- కోవూరు తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శిలుగా సోలా ఉమా, రాఘవేంద్ర, కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రప్రసాద్, షబీనా, హైమావతి, జరీనా, విజయలక్ష్మి, మనుషా, అలాగే ఇందుకూరుపేట తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నవనీత, కోశాధికారిగా రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా మొబీనాను ఎన్నుకున్నారు. వీరి చేత ఎన్నికల అధికారులు ప్రమాణం చేయించారు.

రైతుల్ని ఆదుకోవడంలో కూటమి విఫలం



ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నేతల ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నేతలు విమర్శించారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులో ర్యాలీ జరిగింది. బాలాజీ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ధాన్యం బస్తాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లేకపోవడంతో పంటను అమ్ముకోలేక రోడ్డున పడుతున్నారన్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

- 'హలో రైతన్న.. చలో కలెక్టరేట్' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అనుకున్నా పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆత్మకూరు బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

40 గ్రాముల బంగారం, నగదు చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీస్ సిబ్బంది

విడవలూరు: మండలంలోని వావిళ్లలో ఓ ఇంట్లో 40 గ్రాములు బంగారం, రూ.20 వేల నగదును దుండగులు చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో గుంజి శ్రీనివాసులు అనే వ్యక్తి నివాసముంటున్నాడు. అతని ఇంటి పక్కనే చిన్న గదిలో తల్లి నాగమ్మ ఉంటోంది. ఆమె ఉదయం గదిలో ఉంటుంది. రాత్రి వేళల్లో కుమారుడి ఇంటికెళ్లి నిద్రిస్తుంది. సోమవారం రాత్రి గదికి తాళం వేసి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దొంగలు బీరువాలోని 40 గ్రాముల బంగారం, రూ.20 వేలు ఎత్తుకెళ్లినట్లు ఆమె గుర్తించింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

నేటి నుంచి అండర్ 19 స్కూల్ గేమ్స్



మాట్లాడుతున్న డీవీఈఓ కృష్ణారెడ్డి

నెల్లూరు(టౌన్): 69వ స్కూల్స్ గేమ్స్ అండర్ 19 జిల్లా స్థాయి పోటీలు బుధవారం నుంచి జరుగుతాయని ఆర్ఐఓ వరప్రసాదరావు, డీవీఈఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో ఉమ్మడి నెల్లూరుకు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్స్, ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ మోడల్స్ స్కూల్స్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. షెడ్యూల్, వేదికలు, విధివిధానాలను వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పిల్లల జీవితాలతో చెలగాటం



ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని రవాణా, పోలీస్ శాఖ అధికారులు నిత్యం చెబుతుంటారు. అయితే కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. స్కూల్ పిల్లల్ని అధిక సంఖ్యలో ఎక్కించుకుని తీసుకెళ్తున్నారు. దీనిపై తల్లిదండ్రులు కూడా ఆలోచించాల్సిన అవసరముంది. కోవూరు నియోజకవర్గంలో ఆటోలో చిన్నారులను తరలిస్తుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు